# చైతన్య గళం

తెలుగు దిన పత్రిక

సంచిక :193 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగర్ శుక్రవారం 16-8 -2024 వెల : .రూ. 5.00



Dr. Nishank Kande
Cosmetic Dental Surgeon
Reg. No. : A7756

9030666189
9666313322

VEDHA'S
Multi Speciality Dental Hospital

Plot No. 11, Bhima Nagar, Z.P. Road, Kharmanghat,
Saroornagar Mdl., R.R.Dist. Hyderabad - 500 079.


## ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా భారత్



- తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా మారాలి
- ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగాలి
- ప్రపంచం ఎదుగుదలలో భారత్‌ది ప్రత్యేక పాత్ర
- వికసిత్ భారత్ 2047' నినాదం..
- వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహం
- దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు
- అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట
- అంతరిక్ష రంగంలో బలమైన శక్తిగా ఎదిగిన భారత్
- మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎర్రకోట వేదికగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ సందేశం
- వరుసగా 11వ సారి జాతీయ పతాకావిష్కరణం
- వచ్చే ఐదేళ్లలో 75వేల మెడికల్ సీట్ల పెరుగుదల
- నూతన నేర చట్టాలతో న్యాయానికే ప్రాధాన్యత

15,ఆగష్టు (చైతన్యగళం న్యూఢిల్లీ

భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని, తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ను మార్చాలన్నదే లక్ష్యమని ప్రధాని మోడీ అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని తెలిపారు. ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని, అలాగే న్యాయ వ్యవస్థలో

-మిగతా 2 లో



### రుణమాఫీ పేరుతో రైతులను
## మభ్యపెడుతున్న ప్రభుత్వం

- మాఫీ జరగనందువల్లనే రాహుల్ రాష్ట్రానికి రాలేదు
- అప్పుడు కరెంట్ పోతే వార్త..ఇప్పుడు కరెంట్ ఉంటే వార్త
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

15,ఆగష్టు (చైతన్యగళం హైదరాబాద్,

కాంగ్రెస్ సర్కార్ రూ. 2 లక్షల రైతు రుణమాఫీ పేరుతో రైతులను మభ్యపెడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ఆరోపించారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయనందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రానికి రాలేదని విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు నుంచి ఎప్పుడైనా తీర్పు రావొచ్చని తెలిపారు. మైసూర్ బజ్జీలో మైసూర్ ఉండదనేది ఎంత వాస్తవమో,

-మిగతా 2 లో

### తెలంగాణకు
# స్వేచ్ఛ కల్పించాం






- ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం
- ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపాం
- రుణమాఫీతో రైతన్నల్లో ఆనందం కల్పించాం
- త్వరలోనే రైతు భరోసా కూడా చేపడతాం
- సన్న ధాన్యానికి 5వందల బోనస్ ప్రకటించాం
- అందెశ్రీ జయజయహేను రాష్ట్ర గీతంగా ప్రకటించాం
- సాంస్కృతిక పునరుజ్జీవానికి నాంది పలికాం
- అప్పులకుప్పగా చేసిన రాష్ట్రాన్ని సరిదిద్దుతున్నాం
- అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి..మోయలేని భారం కల్పించం
- నెహ్రూ నుంచి రాజీవ్ వరకు అందరూ దేశాం కోసం కృషి
- నెహ్రూ విధానాలే సస్య విప్లవానికి నాంది పలికాయి
- గోల్కొండ కోట వేదికగా సిఎం రేవంత్ స్వాతంత్ర్య సందేశం

15,ఆగష్టు (చైతన్యగళం హైదరాబాద్,

తెలంగాణలో గత పదేళ్లలో కోల్పోయిన స్వేచ్ఛను పునరుద్ధరించడంతో పాటు.. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ చిత్తశుద్ధితో పాలన సాగిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆరుగ్యారెంటీల్లో భాగంగా రైతులకు రుణమాఫీ చేశామని, అలాగే రైతుభరోసా కూడా త్వరలోనే అందచేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.

-మిగతా 2 లో






## స్కిల్స్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటోమొబైల్, ఏయిరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఐటీ వంటి ప్రముఖ రంగాల్లో మహీంద్రా గ్రూపు సంస్థలకు ఆయన ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో

-మిగతా 2 లో

## కెటిఆర్..మీ నాయన నేర్పిన సంస్కారం ఇదేనా?


- -బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్స్ చేసుకోవాలా
- -గత పదేళ్లుగా క్లబ్బులు, పబ్బుల కల్చర్ ప్రోత్సహించారు
- -తోణం మహిళలకు క్షమాపణలు చెప్పాలన్న సీతక్క




హైదరాబాద్,

తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు వేసుకోవచ్చని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన అభ్యంతర వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. ఈ అవకాశంపై రాష్ట్రంలోని మహిళలు హర్షం వ్యక్తం చేస్తుండగా..

-మిగతా 2 లో



## శభాష్ ..రంగనాథ్

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రశంసలు

హైదరాబాద్,

హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ వెనకడుగు వేయకపోవడం పట్ల మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ప్రశంసించారు. భాగ్యనగర వ్యాప్తంగా హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై మురళి గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఏవీ రంగనాథ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. దీంతోపాటు ఓ పాలనపరమైన సూచన కూడ చేశారు.

-మిగతా 2 లో

## మరో రెండేళ్లలో సీతారామ పూర్తి

### మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ కుమార్ వెల్లడి



15,ఆగష్టు (చైతన్యగళం భద్రాద్రి కొత్తగూడెం,

సీతారామ ప్రాజెక్టును ఆగస్టు 15, 2026నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి కృష్ణా పరీవాహక ప్రాంతానికి నీళ్లు తరలించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వారు ఉద్ఘాటించారు. ప్రాజెక్టు మూడు పంప్ హౌస్‌లు ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడారు. గురువారం సీతారామ ప్రాజెక్టు మూడు పంప్ హౌస్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క ప్రారంభించారు. మొదటి పంప్‌హౌస్‌ను

-మిగతా 2 లో



## ఎస్ఎస్ఎల్వీ -డీ 3 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్

నెల్లూరు, నెల్లూరు జిల్లా శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్వీ -డీ 3 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ మొదలయ్యింది. శుక్రవారం షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఉదయం ఉదయం 9.17 గంటలకు నింగిలోకి లాంచ్ చేస్తున్నట్టు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా నింగిలోకి పంపనున్న ఈఓఎస్ -08 శాటిలైట్ ఉపగ్రహం భూ పరిశీలన చేస్తుందని వివరించారు. ఇందు కోసం ఎస్ఎస్ఎల్వీ -డీ 3 ప్రయోగ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం ప్రయోగించనున్న రాకెట్ల వివరాలను వెల్లడించారు. నవంబర్‌లో గగన్‌యాన్ రాకెట్, నావిక్ శాట్ ప్రయోగం చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాదిలో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం ద్వారా ప్రోబ్ శాటిలైట్ నింగిలోకి వెళ్తుందని అన్నారు. నాసా వారి

-మిగతా 2 లో

## స్కిల్స్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

(మొదటి తరువాయి)

స్కిల్స్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ఇటీవలే అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందింది. దీని ఏర్పాటు కోసం ఆగస్టు ఒకటో తేదీన రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట బేగరికంచెలో సీఎం రేవంత్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. అలాగే ముఖ్యమంత్రి ఇటీవలి కాలంలోనే ఆనంద్ మహీంద్రాతో సమావేశమై స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించి దానికి ఛైర్ పర్సన్ గా కొనసాగాలను కోరారు. ఈ విషయాన్ని విదేశీ పర్యటనలో న్యూయార్క్ లోని ఎన్నారైలతో భేటీలో భాగంగా.. కొత్త స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్ గా ఉండటానికి ఆనంద్ మహీంద్ర సానుకూలంగా స్పందించారని, కొద్ది రోజుల్లో ఆయన స్కిల్స్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఛైర్ పర్సన్ గా ఆయన పేరును ఖరారు చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## శభాష్ ..రంగనాథ్

(మొదటి తరువాయి)

'రంగనాథ్ శభాష్.. మంచి పని చేస్తున్నారు. అలాగే ముందుకు సాగండి. ప్రజాప్రతినిధులు చాలా మంది దీనిని సహజంగా తీసుకొని అడ్డగోలుగా ప్రభుత్వ, చెరువు శిఖం భూములను ఆక్రమిస్తున్నారు. గత పాలకులు మేం తింటాం మీరు తినండి అని అందరిని దొంగలుగా మార్చారు. లక్షల కోట్ల భూములను, ప్రాణాలను రక్షించే చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలి' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌కి తెలంగాణ సీఎంవో, డీజీపీ అధికారిక ఎక్స్ అకౌంట్లను ట్యాగ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రంగనాథ్‌కి పూర్తి ప్రోత్సాహాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. మనం విధుల్లో పారదర్శకంగా ఉండడమే కాదు ఉన్నట్టు కూడా కనిపించాలని, ఇది రంగనాథ్‌కి తాను ఇస్తున్న అడ్మినిస్ట్రేటివ్ టిప్ అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. ముఖ్యమంత్రి హైడ్రాని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.హైదరాబాద్ వ్యాప్తంగా హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తున్నారు. ఆగస్టు 13న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథపై తీవ్ర విమర్శలు చేయగా, నిన్న ఎంఐఎం కార్పొరేటర్లు హైడ్రా తీరుపై మేయర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

## ఎస్ఎస్ఎల్వీ -డీ 3 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్

(మొదటి తరువాయి)

నిస్సార్ ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎం కె3, ఎల్వీఎం 3 రాకెట్ ప్రయోగాల ద్వారా నింగిలోకి విభిన్న ఉపగ్రహాలు పంపనున్నట్లు వివరించారు. మరో ఏడాదిలో రాడార్ ఇమేజింగ్ శాటిలైట్, జియో ఇమేజింగ్ శాటిలైట్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ శాటిలైట్, టీడీఎస్ రాకెట్ ప్రయోగాలకు సిద్ధమవుతుందని ఛైర్మన్ సోమనాథ్ వెల్లడించారు.

## మరో రెండేళ్లలో సీతారామ పూర్తి

(మొదటి తరువాయి)

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించగా, ములకలపల్లి మండలం కమలాపురం వద్ద మూడో పంప్ హౌస్‌ను మంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు రెండో పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టు డీపీఆర్ చూస్తే 39శాతం పనులు మాత్రమే చేసినట్లు తెలుస్తోంది. కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టుకు మోటార్లు పెట్టారు. గత ప్రభుత్వం కుక్క గోతులు తవ్వింది తప్ప డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తవ్వలేదు. 80వేల పుస్తకాలు చదివిన కేసీఆర్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో రిజర్వాయర్ నిర్మించడం

## కెటిఆర్..మీ నాయన నేర్పిన సంస్కారం ఇదేనా?

(మొదటి తరువాయి)

కేటీఆర్ మాత్రం తీవ్ర అభ్యంతర వ్యాఖ్యలు చేయడంతో యావత్ మహిళా లోకం ఒక్కసారిగా భగ్గుమన్నది. కేటీఆర్ వ్యాఖ్యలపై తాజాగా.. మంత్రి సీతక్క వీడియోను రిలీజ్ చేశారు. మాజీ మంత్రి వ్యాఖ్యలను సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు. 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్‌లు, రికార్డింగ్ డాన్స్‌లు చేసుకోవచ్చని కేటీఆర్ అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారు. మీ తండ్రి కేసీఆర్‌గారు మీకు నేర్పిన గౌరవం సంస్కారం ఇదేనా కేటీఆర్?. మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డాన్స్‌లు చేస్తున్నారా?. ఆడవాళ్ళంటే మీకు గౌరవం లేదు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. భేషరతుగా కేటీఆర్ తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి. ఆడవాళ్ళను కించపరిచే విధంగా బ్రేక్ డాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో ఉన్న బురదకు నిదర్శనం. గత పది సంవత్సరాలు హైదరాబాద్‌లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీది. మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నాము. అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నాం. శ్రమ జీవులు, శ్రామిక మహిళలు ప్రయాణ సమయంలో సమయం వృధా చేయకుండా ఏదో పని చేసుకుంటే తప్పేంటి?' అని కేటీఆర్‌పై సీతక్క ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఇంటి వద్ద చేసుకునే చిన్నా చితక పనులు బస్సుల్లో చేసుకుంటే.. వారిని బ్రేక్ డ్యాన్స్‌లు వేసుకోమనడం దుర్మార్గం. మహిళలు బ్రేక్ డ్యాన్స్‌లు చేసుకోండి అనే మాటలు నీ నోటికి ఎలా వచ్చాయి కేటీఆర్..? కేటీఆర్ మాట్లాడిన మాటలు అత్యంత అసభ్యకరంగా ఉన్నాయి. మహిళలు పట్ల అసభ్యకర మాటలు మాట్లాడిన కేటీఆర్ తీరును ఖండిస్తున్నాను. తెలంగాణ మహిళలను బ్రేక్ డ్యాన్స్ చేసుకొండి అనే ధైర్యం ఎలా వచ్చింది కేటీఆర్..?. తెలంగాణ మహిళలకు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలి.. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ కూడా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

# ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా భారత్

(మొదటి తరువాయి)

సంస్కరణలు అవసరమని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కలల తీర్మానమని అన్నారు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని, వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట లో స్వాతంత్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుందని, దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామని, యువతకు నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తామని, భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భావిస్తుందన్నారు. స్వయం సహాయక రంగాలకు ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని, కోటి మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వికసిత్ భారత్ థీమ్ తో హర్ ఘర్ తిరంగా పేరుతో ఘనంగా స్వాతంత్య వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని, దేశం కోసం జీవితాలనే పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని, భారత ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉందని, శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గిందని, స్వాతంత్ర్యం కోసం ఆనాడు 40 కోట్ల మంది ప్రజలు పోరాడారని, ఇప్పుడు మన దేశ జనాభా 140 కోట్లకు చేరిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 140 కోట్ల మంది ప్రజల కలలను సాకారం చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అన్నారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బందిపెట్టాయని.. ఈ సందర్భంగా విపత్తు బాధిత కుటుంబాలకు మోదీ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సర్జికల్ స్ట్రైక్స్‌ను దేశ ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారని, అభివృద్ధి బ్లూ ప్రింట్‌గా సంస్కరణలు తీసుకొస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. 'నేషన్ ఫస్ట్.. రాష్ట్ర హిత్ సుప్రీం' సంకల్పంతో ముందుకెళ్తున్నామని, బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలుచేశామని చెప్పారు. భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైందని అన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా 15 కోట్ల మందికి లబ్ది చేకూరుతుందని, భారత్‌లో చిరు ధాన్యాలు ప్రపంచంలో అందరికీ చేరాలని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని, వందల కొద్దీ స్టార్టప్‌లు వచ్చాయని, ప్రైవేట్ ఉపగ్రహాలు, రాకెట్లు ప్రయోగిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మరో 10 కోట్ల మంది మహిళలు.. కొత్తగా స్వయం సహాయక సంఘాల్లో చేరారన్నారు. మౌలిక సదుపాయాల్లో పెను మార్పులు తీసుకొచ్చా మని, దేశ హితమే ప్రథమ ప్రాధాన్యమని ఆయన అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, మన కలలు సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. నూతన నేర చట్టాల్లో శిక్షల కంటే న్యాయానికే ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వ ప్రమేయం అతితక్కువగా ఉండేలా పౌర సేవలు ఉంటాయని, ఎగుమతుల్లో పురోగతితో ప్రపంచ ప్రగతిలో భారత్ పాత్ర పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు

# తెలంగాణకు స్వేచ్ఛ కల్పించాం

(మొదటి తరువాయి)

తెలంగాణ సాధించుకొని దశాబ్ద కాలమైనా రాష్ట్ర గీతం లేని పరిస్థితి మొన్నటి వరకు ఉందని సీఎం రేవంత్ అన్నారు. ప్రముఖ ప్రజాకవి అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ...' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి ఆ లోటును భర్తీ చేశామని, తద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికామని వ్యాఖ్యానించారు. నేటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రేవంత్ పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను సీఎం తిలకించారు. అంతకుముందు పరేగడ్ గ్రౌండ్‌లో అమరులకు నివాళి అర్పించారు. మా సిద్దాంతం గాంధీ సిద్దాంతం. మా వాదం గాంధేయవాదం. తెలంగాణ రాష్ట్ర పేరును సూచించే సంక్షిప్త అక్షరాల విషయంలో టిఎస్ స్థానంలోటిజిని ప్రభుత్వం పునరుద్ధరించింది. ఇది ప్రజల ఆకాంక్ష. మా ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉంది. గత పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అప్పు దాదాపు 10 రెట్లు పెరిగింది. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో రూ.75,577 కోట్లుగా ఉన్న అప్పు, గత ఏడాది డిసెంబరు నాటికి దాదాపు రూ.7 లక్షల కోట్లకు చేరింది. దీనిపై శ్వేతపత్రం కూడా విడుదల చేశాం. దయనీయ స్థితిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచేందుకు ఆర్థిక పునరుజ్జీవనం అవసరం అని భావించాం. ఆ దిశగా రాష్ట్ర అప్పులను రీస్ట్రక్చర్ చేయించే ప్రయత్నంలో ఉన్నాం. ఇటీవల అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమయ్యాం. తక్కువ వడ్డీలతో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకునే అంశంపై మా మధ్య సానుకూల చర్చలు జరిగాయని చెప్పడానికి సంతోషిస్తున్నాను. గతంలో మాదిరిగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి... రాష్ట్ర ప్రజల నెత్తిన మోయలేని భారం మోపే పనులు మేం చేయబోం అని స్పష్టం చేశారు. ఆర్థిక అవరోధాలు ఉన్నా ప్రతి ఇంటా సౌభాగ్యాన్ని నింపాలనే మహాసంకల్పంతో రూపొందించిన అభయహస్తం హామీలన్నీ తూ.చ తప్పకుండా అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.. పంచవర్ష ప్రణాళికలు రచించి, ఈ దేశానికి వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి అన్నవి రెండు కళ్లు అని నమ్మి ఆ దిశగా తొలి అడుగులు వేయించిన దార్శనికుడు పండిట్ నెహ్రూ, ఆయన ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను మనం ఈ రోజు ఆధునిక దేవాలయాలుగా పిలుచు కుంటున్నాం. ఈ దేశంలో కోట్లాది ఎకరాలు పంటలతో పచ్చతోరణాన్ని కట్టుకున్నాయంటే దానికి కారణం నెహ్రూ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులే. నాగార్జున సాగర్, శ్రీశైలం, భాక్రానంగల్, శ్రీరాంసాగర్ లాంటి ప్రాజెక్టులు నెహ్రూ ప్రారంభిస్తే... ఆ తర్వాత వాటిని పూర్తి చేసి, కోట్లాది మంది రైతుల పొలాలకు సాగు జలాలు పారించిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీకి దక్కుతుంది. అంతేకాదు, పారిశ్రామికంగా బిహెచ్ఇఎల్, ఇసిఐఎల్, ఐడిపిఎల్, మిథాని వంటి ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు ఆ స్వర్ణయుగంలో నెలకొల్పబడినవే. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం చేపట్టి అన్నిరంగాల సమగ్రాభివృద్ధికి కృషిచేసిన ఘనత నాటి ప్రభుత్వాలది. బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రమే తెలిసిన బ్యాంకింగ్ వ్యవస్థను జాతీయాకరణతో గ్రామీణ ప్రజల చెంతకు చేర్చిన ఘనత, ప్రతి పౌరుడుకి బ్యాంకును అందుబాటులోకి తెచ్చిన గొప్పతనం ఆ నాటి దార్శనికుల వల్లనే జరిగింది. 1947 వరకూ ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకున్న మనదేశం, ఈ నాడు ప్రపంచంలో ఆహారధాన్యాలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాలలో ఒకటిగా ఎదగడానికి కారణం స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రవేశ పెట్టిన హరిత విప్లవమే. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ప్రజల సామాజిక, ఆర్థిక పునరుజ్జీవనానికి గీటురాయిగా మారింది. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశం టెలికమ్యూనికేషన్స్ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. అంతరిక్ష, అణుశక్తి కార్యక్రమాల్లో స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించే అతికొద్ది దేశాల సరసన భారతదేశాన్ని ఆనాడే నిలుపగలిగారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే అహింసనే ఆయుధంగా మలిచి చేసిన మహా సంగ్రామం మన స్వాతంత్య్ర పోరాటమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా రుణమాఫీ చేస్తున్నాం. రుణమాఫీ అసాధ్యమని కొందరు వక్రభాష్యం చెప్పారు. రూ.2 లక్షల వరకు అమలు చేసి చూపిస్తున్నాం. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కావడం లేదు. అలాంటి వారిని గుర్తించి అందజేస్తాం. కలెక్టరేట్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తాం. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశాం. ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చాం. దీని పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణకు కట్టుబడి ఉన్నాం.

# రుణమాఫీ పేరుతో రైతులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

(మొదటి తరువాయి)

జాబ్ క్యాలెండర్లో జాబ్స్ ఉండయనేది అంతే నిజమని సెటైర్లు వేశారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ అబద్ధం చెప్పారని మండిపడ్డారు. స్టేషన్ ఘనపూర్‌కి త్వరలోనే ఉప ఎన్నిక వస్తుందని.. అక్కడి నుంచి బీఆర్ఎస్ నేత రాజయ్య గెలుపు ఖాయమని

ధీమా వ్యక్తం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కడియం కావ్య, శ్రీహరిని ప్రజలు త్వరలోనే నిలదీస్తారని హెచ్చరించారు. 'ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావుపై హైకోర్టుకు వెళ్ళాం. మిగతా వారిపై కూడా సుప్రీంకోర్టుకు వెళతాం. అసెంబ్లీ ఎన్నికల్లో 14 స్థానాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయాం. నేతలు, కార్యకర్తలు బాధపడాల్సిన పనిలేదు, భయపడాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలను ప్రజలు నమ్మి మోసపోయారు. సీఎం రేవంత్ రెడ్డి 8 నెలల పాలనలో రాష్ట్రంలో కరెంట్ మాయమైంది. కేసీఆర్ పాలనలో కరెంట్ పోతే వార్త, రేవంత్ పాలనలో కరెంట్ ఉంటే వార్త. ఊసరవెల్లులు పాలన చేస్తే తొండలు, బల్లుల వల్ల కూడా కరెంట్ పోతుంది. నోటిఫికేషన్ ఇవ్వకుండానే 30వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారు. కాంగ్రెస్ నిజస్వరూపం తెలంగాణ యువతకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేశారు. రేవంత్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ అని బిల్డప్ ఇస్తోంది. ఆగస్టు 15 వచ్చినా రెండు లక్షల రుణమాఫీ కాలేదు. అందుకే రాహుల్ గాంధీ రమ్మన్నా రావడం లేదు. రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు తులం ఇనుము కూడా ఇవ్వరు. ఆసరా రూ.4 వేలు పెంచుతాం అని మాట తప్పారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని విమర్శలు చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రేవంత్ రేవంత్ సోదరులే కనిపిస్తున్నారు. ఇది కుటుంబ పాలన కాదా? కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలి. లేదంటే ప్రజల్లోనే వారి వైఫల్యాలను ఎండగడతాం. రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి రూ. వెయ్యి కోట్ల టెండర్ ఇచ్చారు. రాష్ట్రం దివాళా తీసిందని రేవంత్ మాట్లాడుతున్నారు. ఇలా అబద్దాలు చెబితే ఎవరైనా నమ్ముతారా? 2019లోనే మా సర్కార్‌తో కాగ్నిజెంట్ ఒప్పందం చేసుకుంది. కాగ్నిజెంట్‌ను కాంగ్రెస్ తీసుకొచ్చినట్లుగా కవరింగ్ ఇస్తున్నారు. మాయ మాటలు, స్టంట్లతో ప్రభుత్వం ఎక్కువ రోజులు నడపలేరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. '2014లో కాంగ్రెస్ సర్కార్ మాకు రాష్టాన్ని అప్పజెప్పిన నాటికి తెలంగాణ రూ.300 కోట్ల రెవెన్యూ మిగులు రాష్ట్రం. 2023లో మేము తిరిగి రాష్టాన్ని అప్పగించే నాటికి రూ.5 వేల 900 కోట్ల రెవెన్యూ మిగులు ఉంది. అప్పులు చేస్తే రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఎలా ఉంటుంది. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకోవడానికి మాకేం ఖర్మ. మాకు ఒప్పందం ఉంటే మా ఇంటి ఆడ బిడ్డ ఇన్ని రోజులు జైలులో ఉంటుందా. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ వీపు చింతపండు అవుతుంది. త్వరలోనే అన్ని నియోజక వర్గాల్లో శిక్షణ తరగతులు పెడతాం. కేసీఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్ట్‌ను రేవంత్ తానే పూర్తి చేసినట్లు చెబుతున్నారు. ఈ స్టంట్లతో ప్రజలను మోసం చేయలేరు' అని కేటీఆర్ అన్నారు.

# కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు

## -ఏఐటియుసి నాయకులు





**వనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** ఏఐటీయూసీ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం లో పలు తీర్మానాలను ప్రవేశపెట్టడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, మోష లు తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలి. కార్మికులందరికీ కనీస వేతనం 26000 ఇవ్వాలి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ యాజమాన్యాలు కార్మికుల జీతాలను బ్యాంకు ఖాతా ద్వారా చెల్లించాలి. బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డులో పెండింగ్ ఫైల్స్ ను తక్షణమే మంజూరు చేయాలి.హమాలీ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.ఆటో కార్మికులందరికీ నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలి. ఎం.వి ఆక్ట్ 2019 నో రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలి.సెకండ్ ఏఎన్ఎం లను పర్మినెంట్ చేయాలి.మధ్యాహ్న భోజన పథకం ను ప్రవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలి. ఐసిడిఎస్ ను స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పడం ప్రభుత్వం విరమించుకోవాలి. ఆశాలకు ఫిక్స్ వేతనం చెల్లించాలి.మున్సిపల్ కార్మికులకు పని భారం తగ్గించాలి పట్టణాల విస్తరణకు అనుగుణంగా కొత్తగా మున్సిపల్ కార్మికులను నియమించాలి. అన్ని ప్రభుత్వ స్కూళ్లలో స్వీపర్లను నియమించాలి ఉన్న స్వీపర్లకు కనీస వేతనం 26,000 అమలు చేయాలి.నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ సమక్షంలో AITUC జిల్లా అధ్యక్షులుగా శ్రీహరి ప్రధాన కార్యదర్శిగా మోష ఉప ప్రధాన కార్యదర్శిగా గోపాలకృష్ణ. సహాయ కార్యదర్శులుగా రఘు. లక్ష్మమ్మ. ఉపాధ్యక్షులుగా శ్రీరామ్. శ్యాంసుందర్. కోశాధికారిగా భాస్కర్ మరో 17 మందిని జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## రవాణా శాఖ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**అనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా రవాణాధికారి మానస ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.ఈ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఐ లు ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాన్ని అందుకున్న యుగంధర్



**వనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** 78వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా సి.యుగంధర్ ఉత్తమ సెక్టోరియల్ అధికారిగా ప్రశంసా పత్రాన్ని పొందారు. వనపర్తి జిల్లా విద్యాశాఖలో విశిష్టమైన సేవలు అందించినందుకుగాను గురువారం కలెక్టరేట్ లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం చేతుల మీదుగా యుగంధర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా యుగంధర్ ను అధికారులు, బంధువులు, స్నేహితుల అభినందించారు

## పదవ తరగతి స్కూల్ టాపర్స్‌లకు నగదు ప్రోత్సాహకం



**వెల్దండ ఆగస్టు 15 (చైతన్య గళం):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దండ పదవ తరగతి 2023-24 బ్యాచ్ లో స్కూల్ టాపర్స్ రాత్లావత్ సుమన్ మరియు సామ శ్రీజ లకు నగదు ప్రోత్సాహకం గా కీర్తిశేషులు గోల్సాం కనకయ్య యాదవ్ జ్ఞాపకార్థంగా వారి కుమారులు జి అమరనాథ్ యాదవ్ మల్లేష్ యాదవ్ లు 5వేల రూపాయలు నగదు మెమొంటోను స్కూల్ హెడ్మాస్టర్ రవీందర్ చేతుల మీద అందజేయడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాలకు ఎంతో ఘనకీర్తి కలిగినదని ఇక్కడ చదివిన వారు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు ప్రతి సంవత్సరం ఈ విధంగా నగదు మెమొంటో ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నందుకు ఉపాధ్యాయులు వారిని అభినందించారు ఈ కార్యక్రమంలో దానయ్య చంద్రశేఖర్ రవికిరణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## మత్స్య సహకార సంఘంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**వనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** వనపర్తిలో ముదిరాజ్ సోదరులు 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మత్స్య సహకార పారిశ్రామిక సొసైటీ ఆఫీసులో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాట వీరులను స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నందిమల్ల చంద్రమౌళి, ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా బిజెపి అధ్యక్షుడు



**వనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ వారి నుండి విముక్తి కోసం ప్రాణత్యాగం చేశారని వారి త్యాగాల ఫలితమే ఈనాడు స్వేచ్ఛ స్వాతంత్రం అనుభవిస్తున్నామన్నారు .

## అచ్చంపేటలో భారీ వర్షం



**అచ్చంపేట ఆగస్టు 15 (చైతన్య గళం):** నియోజకవర్గంలోని అమ్రాబాద్, అచ్చంపేట, లింగాల, ఉప్పునుంతల, బల్మూరు మండలాల్లో భారీ వర్షం. భారీ వర్షం కారణంగా అచ్చం పేట పట్టణంలోని కూరగాయల మార్కెట్లో వాన నీటిలో కొట్టుకుపోయిన కూరగాయలు ఇబ్బందులు పడ్డ విక్రయదారులు. భారీ వర్షం కారణంగా ఉప్పునుంతల రోడ్డు, అచ్చంపేట పాత బస్టాండ్ నెహ్రూ చౌరస్తా ప్రధాన రహదారుల వెంట పెద్ద మొత్తంలో వరద నీరు చేరుకోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ వ్యాపార సముదాయాల్లోకి వర్షం నీరు రావడంతో దుకాణాలు మొత్తం వర్షం నీటితో తడిసి పోయాయి. గత రెండు మూడు రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడ్డ ప్రజలు గురువారం సాయంత్రం కురిసిన భారీ వానకు వాతావరణం ఒకసారిగా చల్లబడడంతో ప్రజలందరూ సేద తీరారు. భారీ వాన రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వాన పంటచేలకు ఎంతో ఉపయోగపడుతుందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## సేవా పథకం అందుకున్న అదనపు ఎస్పీ తేజోవత్ రాందాస్



**వనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్లో అదనపు ఎస్పీ రామదాసు తేజోవత్ గురువారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నుంచి ఉత్తమ సేవా పథకం అందుకున్నారు. వృత్తి ధర్మంలో భాగంగా అందించిన సేవలను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సేవా పథకం అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ తన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ముంచింతల్ లోనిస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 15 (చైతన్య గళం):** ముంచింతల్ లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు స్వామివారి ఆధ్వర్యములో నడుస్తున్నటువంటి నేత్ర విద్యాలయం వేద పాఠశాల జిమ్స్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు నేత్ర విద్యాలయ వేద పాఠశాల విద్యార్థులు చేసిన NCC సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమానికి నేపాల్ కృష్ణమాచార్య స్వామి వారు ముఖ్యఅతిథిగా విచ్చేసి జండా వందనం చేశారు వారితో పాటు ముఖ్యఅతిథిగా జిమ్స్ మెడికల్ కాలేజ్ డైరెక్టర్ నవీన్ మరియు సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో ప్రెసిడెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రమేష్ గుప్తా నేత్ర ప్రిన్సిపాల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పెద్దలు పాల్గొన్నారు.

**కడ్తాల్, ఆగస్టు 15 (చైతన్య గళం):**



కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో 78వ, స్వాతంత్ర దినోత్సవం వేడుకలు సంతోషాలతో జాతీయ జెండా పండుగను నిర్వ హించారు. గురువారం 78వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ముద్విన్ గ్రామ గౌడ సంఘం భవనం వద్ద గౌడ గీత కార్మిక సంఘం అధ్యక్షులు పట్నం నరసింహ జాతీయ జెండాను ఎగురవేసి స్వతంత్ర దినోత్సవ వే డుకలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పట్నం కిష్టయ్య, గౌడ సంఘం నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర దేవస్థానంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



**వనపర్తి ఆగస్టు 15 (చైతన్య గళం):** వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి పవిత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఉదయం అగ్ని ప్రతిష్ట, హోమశాలలో హోమము, పూర్ణాహుతి సాయంత్రం హోమము, శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, శనివారం యాగశాలలో పూర్ణాహుతి తదుపరి పవిత్ర మాల తొలగించి 108 కళాశాలతో అభిషేకం నిర్వహించనున్నారని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అయ్యలూరి రఘునాథం తెలిపారు.

## నల్లమల అడవిలో వన్యప్రాణి చంపి మాంసం తరలిస్తూ పట్టుపడ్డ ముగ్గురు వ్యక్తులు



**అమ్రాబాద్ ఆగస్టు 15 (చైతన్య గళం):** నాగర్ కర్నూలు జిల్లా నల్లమల్ల అటవీ ప్రాంతంలో అమ్రాబాద్ డివిజన్ పరిధిలోని అడవిలో వన్యప్రాణి అయిన కనితిని ఉచ్చుల సహాయంతో చంపివేసి మాంసాన్ని తరలించారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ వారిపై కేసు నమోదు చేశమని అమ్రాబాద్ అటవీ క్షేత్ర అధికారి గురు ప్రసాద్ గురువారం మీడియాకు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి అమ్రాబాద్ మండలం వంగురోనిపల్లి గ్రామానికి చెందిన పిల్లి సాయిలు, జక్క నరసింహారావు, కదారి అంజయ్యని ముగ్గురు వ్యక్తులు ఈ నెల 12న ఉచ్చుల సహాయంతో వన్యప్రాణి చంపి మాంసం తరలిస్తూ పట్టు పడ్డారు. విచారణ అనంతరం అటవీ హక్కుల చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసి గురువారం జైలుకు తరలించామన్నారు. నిందితులను పట్టుకుని క్రమంలో అటవీ శాఖ సిబ్బంది డిప్యూటీ రేంజర్ వాణికుమారి, ఖాజా మొయినుద్దీన్, అటవీ బీట్ అధికారులు నాగశేషం, శారద, గోపాల్, వీరయ్య, లక్ష్మణ్, కిరణ్, బాలకృష్ణ, బేసిక్ క్యాంపు వాచర్లు పాల్గొన్నారు.

## 200 మీటర్ల జాతీయ జెండా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట ఆగస్టు 15 (చైతన్య గళం):** 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అచ్చంపేట పట్టణంలో ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయల వద్ద జాతీయ జెండా ఎగరవేయడంతో ఆకాశంలో రెపరెపలాడింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన డాక్టర్ వంశీకృష్ణ తదుపరి కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులతో కలిసి ఏర్పాటుచేసిన రెండు వందల మీటర్ల జాతీయ జెండా తో ర్యాలీ నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని జాతీయతను చాటుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అలాగే జిఎస్ఎన్ స్కూల్ విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాతో ప్రభాతభేరి లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభాతభేరి నిర్వహిస్తూ జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు పలువురిని ఆకట్టుకున్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ ఆగస్టు 15 (చైతన్య గళం):** నిత్య జనగణమన కార్యక్రమం స్వాతంత్ర దినోత్సవమైన నేడు 829 రోజులు పూర్తి చేసుకుని 830వ రోజుకు చేరుకోవడం విశేషం. 2022 మే 7న నిత్య జనగణమన ప్రారంభమయ్యాక ఈ కేంద్రంలో జరిగిన నేటి మూడవ స్వాతంత్ర్య దినోత్సవం చిన్నారుల మధ్యన ప్రత్యేకంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిహెచ్ ఎంసి డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ చిన్నారుల సందడి మధ్య భారతమాతకు వందన సమర్పణ చేశాక బాలబాలికలతో కలిసి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆహ్వానితులు, చిన్నారులతో గొంతు కలిపి జాతీయ గీతాన్ని ఆలపించారు. అందరికీ చాక్లెట్లను పంచి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ ను సత్కరించారు. సోషల్ యాక్టివిస్ట్, సిటిజన్ ఫస్ట్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ శాలిని జాదవ్, ఆల్ ఇండియా మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ అధ్యక్షుడు భాను ప్రసాద్ రెడ్డి, తదితరులు హాజరై ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రజా శ్రీనివాస్ అతిథులకు ఆహ్వానం పలుకుగా నేలంటి మధు, అడ్వకేట్ అరవింద్ రాజ్, ఉపేంద్ర ప్రసాద్ దుబే,తదితరులు కార్యక్రమాన్ని నడిపించారు. డిఎన్ రావు వందన సమర్పణ చేశారు.

# నింగికెగిసిన మువ్వన్నెల జెండా



**కడ్తాల్, ఆగస్టు 15,(చైతన్య గళం):** కడ్తాల్ మండల కేంద్రముతో పాటు మండలంలో అన్ని గ్రామాల్లో 78వ, స్వాతంత్ర దినోత్సవం వేడుకలు ప్రజాప్రతినిధులు అధికారులు సంతోషాలతో జాతీయ జెండా పండుగను నిర్వ హించారు. గురువారం 78వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ ముంతాజ్ బేగం ఎంపీడీఓ కార్యాలయం ముందు ప్రత్యేక అధికారి రామేశ్వరీ, పోలీస్ స్టేసన్ ముందు సిఐ శివప్రసాద్, సింగిల్ విండో కార్యాలయం వద్ద చైర్మన్ గంప వేంకటేశ్, పశువైద్య కార్యాలయం వద్ద పశువై ద్యాధికారి భాను నాయక్, బీసీ సంఘం కార్యాలయం వద్ద ఆ సంఘం అధ్యక్షు లు పిప్పల వెంకటేష్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ శ్రీలత, ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందు ప్రత్యేక అధికారాలు పాఠశాలల ముందు ప్రధానోపాధ్యాయులు, వివిధ పార్టీ కార్యాలయాల ముందు ఆ యా పార్టీల అధ్యక్షులు జాతీయ జెండాలను ఎగురవేసి స్వతంత్ర దినోత్సవం వేడుకలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో, ఎంపిడిఓ సుజాత, టీపీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, మాజీ సర్పంచ్ గుడురు లక్ష్మీ నరసింహ రెడ్డి, ఎంపీటీసీ గూడురు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీ రాబాబా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ, బిక్యానాయక్, బిచ్చ నాయక్, వేణుగోపాల్, గుడురు భాస్కర్ రెడ్డి, జోగు వీరయ్య, చందోజీ నాయకులు సేవ్యానాయక్, గౌడ సంఘం అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ఐక్య వేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, గుడురు భాస్కర్ రెడ్డి,హీర సింగ్, యాదగిరి రెడ్డి, లాయక్ అలీ, భిక్షపతి, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## జంగిలి ఆనంద్ జన్మదిన సందర్భంగా



**వెల్దండ ఆగస్టు 15 (చైతన్య గళం):** వెల్దండ మండల కేంద్రంలో మండలటిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జంగిలి ఆనంద్, గడుసు శివ ,జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శాలువులతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, చల్లా మధుసూదన్ రెడ్డి ,చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరసింహ ,ముదిరాజ్ ప్రసాద్ ,జోగు రవికుమార్ , శేఖర్ ,భాస్కర్ సైదులు, శ్రీను, రాజు, శ్రీనివాసులు , సంజీవ , లాలయ్య , శ్రీను , భక్యా , నందు , రమేష్ ,ముదిరాజ్ మహేష్ ,టైలర్ వెంకటయ్య , శ్రీనివాసులు ,ఎల్ఐసి జగన్ ,సత్యం ,లింగం ,అనిల్ ,రవికుమార్ ,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ జండా ఎగురవేసిన మర్రి నిరంజన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 15 (చైతన్య గళం):** రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఎగరవేసిన ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ & టిపిసిసి సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి , మున్సిపాలిటీ పరిధిలో వివిధ సంఘాలు ఏర్పాటు చేసిన జండా పండుగ కార్యక్రమాలలో పాల్గొన్నారు, అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటీషు బానిస సంకెళ్లు తెంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ రోజు మనందరికీ పర్వదినం. మన దేశ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని మువ్వన్నెల జెండాగా సగర్వంగా ఎగరేసిన ఈ రోజు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కామన్న యాదగిరి, కౌన్సిలర్లు లావణ్య పాండు రంగారెడ్డి, మౌనిక ఉదయ పాల్ రెడ్డి, కలమ్మ జంగయ్య, మర్రి అర్చన రామ్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, నాయకులు పల్లె రజనీకాంత్ గౌడ్ గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 15 (చైతన్య గళం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో శరవేగంతో అభివృద్ధి చెందుతూ దేశంలోనే తలమానికంగా ఉంటున్నదని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు . ఎందరో త్యాగమూర్తుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర్యదినం..అలాంటి త్యాగధనులను చిరస్థాయిగా గుర్తుంచుకోవాలి అన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్
### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**రంగారెడ్డి ఆగష్ 15 (చైతన్య గళం):** రంగారెడ్డి జిల్లా 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హస్తినాపురం లో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈకార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు త్రినాద్ కుమార్ కార్యదర్శి అలంపల్లి నారాయణ గుప్త , మాట్లాడుతూ... అనేక మంది అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేటి ఈ స్వాతంత్ర్య ఫలాలని అన్నారు. ఈకార్యక్రమంలో గణేష్ గుప్త , శ్రీనివాస్ గుప్త , వనిత క్లబ్ అధ్యక్షులు బచ్చు గాయత్రి గుప్త తదితరులు పాల్గొన్నారు

## 78వ, స్వాతంత్ర దినోత్సవం వేడుకలు



ఆమనగల్లు మండలం కేంద్రం 78వ, స్వాతంత్ర దినోత్సవం వేడుకలు లెనోవా ఫ్రైడ్ హై స్కూల్ ముఖ్య అతిథిగా హాజరైన ఆపిశెట్టి రాము జెండా ఆవిష్కరించారు. పాఠశాలలో స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో అలరించిన చిన్నారులు.

# పోలీస్ పరేడ్ మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**హన్మకొండ ప్రతినిధి ఆగస్టు 15 (చైతన్య గళం):**
హనుమకొండ జిల్లా కేంద్రం పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి.రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ దర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండ సురేఖ ముఖ్యతిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పుర ప్రముఖులను, స్వాతంత్ర్య సమరయోధులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు,ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి తిలకించి వివరాలను తెలుసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి మంత్రి, జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో వరంగల్ పార్లమెంటు సభ్యులు కడియం కావ్య, వరంగల్లు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్,నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వనీతానాజీ వాకాడే ,అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది,స్వాతంత్ర్య సమరయోధులు,ప్రజలు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.


# మోషన్ కాలేజీలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**-స్వాతంత్ర్య పోరాట యోధులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి**
**-వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్,చైర్మన్ మోషన్ జూనియర్ కాలేజ్**



**హన్మకొండ ప్రతినిధి ఆగస్టు 15 (చైతన్య గళం):**
హన్మకొండ నయీమ్ నగర్ లోని రాజస్థాన్ కోటా మోషన్ ఐఐటీ,నీట్ ఇన్స్టిట్యూట్ లో 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు.కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి 200 సం. పాటు భారతదేశాన్ని పాలించిన బ్రిటిష్ ప్రభుత్వాన్ని పారద్రోలడానికి అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు పోరాటాలు చేశారు,వారి పోరటాల ఫలితంగా ఆనాడు భారత దేశానికి స్వాతంత్ర్యము రావడం జరిగింది. విద్యార్థులందరు కుడా మీ యొక్క లక్ష్యాన్ని ఎంచుకొని దాని సాధన కోసం నిరంతరం కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనుజ్ కుమార్,సాహిల్ కాత్యాల్,మోహన్ మంగళం,ప్రదీప్ పట్కార్,దామన్, అవినాష్,సురేందర్ కాలేజీ సిబ్బంది మురళి,తళ్లపెల్లి రమేష్ గౌడ్,రాజు,శశిదర్,శివ,అరుణ్, రవళి,అరుణ,శిల్ప,మమత తదితరులు పాల్గొన్నాం

## హన్మకొండ జయ నర్సింగ్ కాలెజి లో 78 వ స్వాతంత్ర్య దినోత్సవం



**హన్మకొండ ప్రతినిధి ఆగస్టు 15 (చైతన్య గళం):**
హన్మకొండ జయ నర్సింగ్ కాలేజి లో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహానీయుల త్యాగాలను స్మరించుకుంటూ ఈనాటి తరం వారి ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరం పునరంకితం కావాలని , దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని మన దేశ స్వాతంత్ర్య సౌభాత్రుత్వాన్ని కాపాడాలని శాంతికి ప్రతిరూపంగా నిలవటాలని క్రుషిచేయాలని పూజ్య బాపూజీ మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు నిలవటాలని ప్రయత్నం చేయాలని ఏఐసిసి సభ్యులు సీనియర్ కాంగ్రేస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షిస్తూ...స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కూర వెంకట్, ఉపాధ్యక్షులు మార్క విజయ్ 8 వ డివిజన్ అధ్యక్షులు తక్కల్లపల్లి మనోహర్‌రావు,యండి ఇబ్రహీం పరిపాలనా కార్యదర్శి ,ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

## సూరలక్ష్మి కాటన్ మిల్ దగ్గర జెండా ఆవిష్కరించిన ఐఎన్టీయుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగళి ప్రసాద్



**ఆమనగల్లు ఆగస్టు 15 (చైతన్య గళం):**
ఆమనగల్లు మండల కేంద్రములో 78వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు ఎంగళి ప్రసాద్ ఆధ్వర్యంలో సూరలక్ష్మి కాటన్ మిల్ వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంగళి ప్రసాద్ జాతీయ జండాను ఆవిష్కరించారు అంబేద్కర్ మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు కార్మిక రంగానికి కార్మికులకు ఐఎన్టీయుసి అండగా ఉంటుందని ప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు మానయ్య,జగన్ జిల్లా నాయకులు కృష్ణ నాయక్,మైసయ్య, రాములు, ఖాదర్, కరీం, శీను నాయక్, అలిమ్, అయోధ్య, నాజర్, ఫెరోజ్, ఫరీద్, గోపాల్ నాయక్,బాబా రాఘవేందర్, సురేష్, కార్మికులు ఖాదర్, గోపాల్, రవి, చందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఎల్బీనగర్ ఆగస్టు 15 (చైతన్య గళం):**
వనస్థలిపురం డివిజన్ లో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వనస్థలిపురం డివిజన్ BRS పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త పలు కాలనీలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో దేశభక్తుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక BRS నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలోని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

**-అమనగల్ అభిద్ధి సాధన సమితి**



**ఆమనగల్లు ఆగస్టు 15 (చైతన్య గళం):**
స్వచ్ఛ భారత్ నిర్మాతలు చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్న కార్మికులుసంపూర్ణ ఆరోగ్య భారత వానికి జీవితాన్ని అంకితం చేసే నిజమైన సేవకుల పారిశుద్ధ కార్మికులు కుటుంబాలు ఆర్థిక ఏతలు మదిలో దాచుకుని ఆరోగ్య సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో విధులు నిర్వర్తిస్తు నిత్య సేవకులు కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కొండంత ఆశతో ఎదురుచూపు సమాన వేతనాలు అమలులో లేక అర్ధ ఆకలితో అలమటిస్తున్న దీనగాధలు తరతరాలుగా వారసత్వంగా బ్రతుకులు మారుతావని కొండంత ఆశతో నేటికీ ఎదురుచూపు పారిశుధ్య కార్మికుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారణ దిశగా ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేస్తూ వారికి న్యాయం చేయాలని స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జంతుక శంకర్ విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రెవల్లి రాజు,వంకేశ్వరం భీమయ్య,పారిశుధ్య కార్మిక విభాగం అధ్యక్షురాలు మీసాల హంసమ్మ ఎడవెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





**యాచారం ఆగస్టు 15 (చైతన్య గళం):**
స్వాతంత్ర దినోత్సవ వేడుకలు యాచారం మండలం లోని పలు గ్రామాల్లో అత్యంత ఘనంగా నిర్వహించారు. తక్కళ్లపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ పథకాన్ని వాసవి క్లబ్ అధ్యక్షులు ప్రొద్దుటూరి. సురేందర్ గుప్త ఆవిష్కరించారు . ఈసందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో తక్కల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ప్రొద్దుటూరు సురేందర్ గుప్తా ప్రధాన కార్యదర్శి విషంశెట్టి సంతోష్ గుప్తా, కోశాధికారి విడియాల శేఖర్ గుప్త , కార్యదర్శి విరబొమ్మల రాజు గుప్త మరియు యాచారం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విరబొమ్మల శ్రీనివాస్ గుప్త,PRG ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరు రవీందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు

# అక్రమ మద్యం పట్టివేత

**-అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు.**




**భువనగిరి నియోజకవర్గం ఆగస్టు 15 (చైతన్య గళం):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ని చిత్తాపురం గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న మధ్యాన్ని పట్టుకొని సీజ్ చేసి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగింది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం వలిగొండ మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన భీమగాని రంగయ్య కిరాణా దుకాణాన్ని తనిఖీ చేయగా అందులో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించి మద్యాన్ని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు వలిగొండ ఎస్సై మహేందర్ లాల్ తెలియజేశారు.



# మరో సినిమాను లైన్‌లో పెట్టిన విశ్వక్‌సేన్

టాలీవుడ్ యాక్టర్ విశ్వక్‌సేన్ ఇటీవలే గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో మెకానిక్ రాకీ సినిమాలో నటిస్తున్నాడు విశ్వక్ సేన్. ఈ మూవీలో మీనాక్షి చౌదరి, శ్రద్దాశ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా విశ్వక్‌సేన్ కొత్త సినిమా వీఎస్ 13 ప్రీ లుక్ విడుదల చేయగా.. విశ్వక్‌సేన్ వైట్ షర్ట్ అండ్ ఖాకీ ప్యాంట్‌లో పిస్తోల్‌తో గ్యాంగ్ వార్‌ను నియంత్రించే పోలీస్‌గా కనిపిస్తున్న హాఫ్ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. తాజాగా వీఎస్13 లాంచ్ చేశాడు విశ్వక్‌సేన్. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. శ్రీధర్ గంటా కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రొడక్షన్ నంబర్ 8గా రానున్న ఈ మూవీ షూటింగ్ త్వరలోనే షురూ కానుంది. నానితో దసరా లాంటి బ్లాక్ బస్టర్ హిట్‌ను అందించిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి దీనిని తెరకెక్కిస్తున్నాడు. హిట్ తర్వాత ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ మరోసారి పోలీసాఫీసర్ గెటప్‌లో కనిపించబోతున్నాడు. హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో కన్నడ భామ సంపద హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫర్.

# చిత్రసీమలో కొనసాగాలా వద్దా అన్నది ప్రేక్షకుల నిర్ణయం

## ఎమర్జెన్సీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కంగనా రనౌత్



నటనకు ఫుల్‌స్టాప్ పెట్టనున్నారంటూ వస్తోన్న వార్తలపై కంగనా రనౌత్ మరోసారి స్పందించారు. తన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు. ఇండస్ట్రీలో కొనసాగాలా.. లేదా అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారన్నారు. 'నేను నటిగా కొనసాగాలా.. వద్దా అనేది ప్రేక్షకుల తీర్పుపై ఆధారపడి ఉంటుంది. రాజకీయాల్లోకి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ, ప్రజలు నన్ను గెలిపించి నాయకురాలిని చేశారు. ఏ పార్టీ తరఫున పోటీ చేశాననేది పక్కన పెడితే.. నేను ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజలు బలంగా కోరుకున్నారు. అందుకే నన్ను గెలిపించారు. అలాగే 'ఎమ్జ్గ÷నీ్స' ఫలితంపై నా నటన జీవితం ఆధారపడి ఉంది. నేను అనుకున్న విజయం సొంతమైతే ఇండస్టీ్రలో ఉంటాను. ఒకవేళ రాజకీయాల్లో నా అవసరం ఎక్కువ ఉందని భావిస్తే ఆ రంగంలోనే కొనసాగుతా. మనకు అవసరమైన, గౌరవనీయమైన చోట ఉండాలి. ప్రస్తుతానికి ఈ విషయంలో నేను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని చెప్పారు. ఇక కంగనా నటించిన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. పలు వాయిదాల అనంతరం సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తూ నిర్మాతగానూ వ్యవహరించిన కంగనా ఇందిరాగాంధీ పాత్రలో నటించారు. జయప్రకాష్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పాత్రలో శ్రేయస్ తల్పడే కనిపించనున్నారు.

## ఒక్క సినిమాతో ఇండస్ట్రీని

# షేక్ చేసిన హీరోయిన్..

## రష్మిక, శ్రీలీలకు టెన్షన్ పుట్టిస్తోందిగా

పై ఫొటోలో ఎలాంటి మేకప్ లేకుండా ఎంతో న్యాచురల్‌గా కనిపిస్తోన్న ఈ అమ్మాయిని గుర్తు పట్టారా? ఈ అందాల తార ఇప్పుడు టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్. యూత్ కలల రాణి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈ బ్యూటీ పేరే వినిపిస్తోంది. సోషల్ మీడియాలో సైతం సొగసరి ఫొటోలు, వీడియోలే. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాలు కూడా చేయలేదు. జస్ట్ ఒక సినిమాతో ఇండస్ట్రీ హాట్ టాపిక్ గా మారిపోయింది. సాధారణంగా సినిమా హీరోయిన్లు స్టేజ్ పై పెద్దగా డ్యాన్సులు గట్రా చేయరు. కానీ అందాల తార మాత్రం స్టేజ్ ఎక్కితే చాలు ఎంతో హుషారుగా, ఎనర్జిటిక్ గా డ్యాన్సులు చేస్తోంది. ఇలా తన అందం, డ్యాన్స్ తో ఇండస్ట్రీలో సంచలనంగా మారిన ఈ ముద్దుగుమ్మ మరెవరో కాదు రవితేజ 'మిస్టర్ బచ్చన్' హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. ఇది ఆమె ఏడాది క్రితం నాటి ఫొటో. సినిమా రిలీజ్ నేపథ్యంలో భాగ్యశ్రీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలను తెగ సెర్చ్ చేస్తున్నారు నెటిజన్లు. ఈ క్రమంలోనే ఈ ఫొటో తన ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో లభ్యమైంది. షాక్, మిరపకాయ్ లాంటి సినిమాల తర్వాత మాస్ మహారాజ్ రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన మూడో చిత్రం మిస్టర్ బచ్చన్. పనోరమా స్టూడియోస్, టీ సిరీస్ సమర్పణలో టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. టీజర్స్, సాంగ్స్ ,ట్రైలర్ తో బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా స్వాంతంత్ర్య దినోత్సవం కానుకగా గురువారం (ఆగస్టు 15)న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఉత్తరాదికి చెందిన భాగ్యశ్రీకి సినిమా ఇండస్ట్రీలో పెద్దగా అనుభవం లేదు. ఇటీవల వచ్చిన హిందీ సినిమా 'చందు ఛాంపియన్'లో హీరోయిన్ గా నటించిందీ అందాల తార. అంతకు ముందు యారియాన్ 2లో నటించారు. ఇక తెలుగులో మిస్టర్ బచ్చన్ తో ప్రేక్షకులను పలకరించిందీ ముద్దుగుమ్మ. సినిమాలో భాగ్యశ్రీ నటనకు మంచి ప్రశంసలు వస్తున్నాయి. రివ్యూయర్లు కూడా ఆమెకు మంచి మార్కులు వేస్తున్నారు. ఇక రవితేజకు పోటీగా డ్యాన్సుల్లో ఇరగదీసిందంటూ అభిమానులు, నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక సినిమాకు కూడా పాజిటివ్ టాక్ రావడంతో ఈ ముద్దుగుమ్మ ఖాతాలో మొదటి హిట్ పడినట్టేనంటున్నారు. మరి ఈ అమ్మడి భవిష్యత్తు ఎలా ఉండనుందో తెలియాల్సి ఉంది. అభిమానులు మాత్రం భాగ్య శ్రీ ఇండస్ట్రీని ఏలడం పక్కా అంటున్నారు.



# తెలంగాణ సంస్కృతికి దగ్గరగా పొట్టేల్




మల్లేశం, వకీల్‌సాబ్ సినిమాలతో నటిగా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న టాలీవుడ్ భామ అనన్య నాగళ్ల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పొట్టేల్. 'సవారీ' ఫేం సాహిత్ మోత్ఖురి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో యువ చంద్ర కృష్ణ హీరోగా నటిస్తున్నాడు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి మేక సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. గుర్రంగట్టు ప్రాథమిక పాఠశాల ముందు తన కుటుంబంతో దిగిన లుక్ ఒకటి షేర్ చేస్తూ.. ఈ మూవీని దసరా కానుకగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే విడుదల తేదీ ఎప్పుడనేది క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. పొట్టేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగను హైలెట్ చేస్తున్న దృశ్యాలు.. వేడుకల్లో అమ్మవారి ముందు పొట్టేల్‌ను బలి ఇవ్వడం, జోగిని రంగం ప్రదర్శించడం లాంటి విషయాలు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ చిత్రాన్ని ఎన్‌ఐఎస్‌ఏ ఎంటర్‌టైనర్‌మెంట్ బ్యానర్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రగ్యా సన్నిది క్రియేషన్స్ బ్యానర్‌పై సురేష్ కుమార్ సడిగే సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరీ, నీల్ సీన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# రాజ్ తరుణ్ సూపర్ ఫాస్ట్..

# రెండు నెలల గ్యాప్‌లో మూడు సినిమాలు

ఒక వైపు లావణ్య వివాదంతో సతమవుతునే మరోవైపు తన సినిమాలను చక చక పూర్తి చేస్తున్నాడు టాలీవుడ్ యువ నటుడు రాజ్ తరుణ్. ఇప్పటికే 'పురుషోత్తముడు', తిరగబడరసామి అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ కుర్ర హీరో మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు. రాజ్‌తరుణ్ కథానాయకుడిగా జె.శివసాయివర్ధన్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'భలే ఉన్నాడే!'. ఈ సినిమాలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మారుతి టీమ్ ప్రొడక్ట్ సంస్థ సమర్పిస్తోంది. ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మాత. ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా సెప్టెంబర్ 07న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. 'పురుషోత్తముడు', తిరగబడరాసామి వచ్చి రెండు నెలలు కూడా అవ్వట్లేదు అంతలోనే మరో సినిమాను విడుదలకు రెడీ చేశాడు రాజ్ తరుణ్. ఇక ఈ సినిమాతోనైనా రాజ్ హిట్ కొడతాడేమో చూడాలి. ఈ చిత్రంలో రాజ్ తరుణ్ టైలర్ పాత్రలో నటిస్తుండగా.. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.

